క్లుప్తంగా

సివిల్స్ ర్యాంకర్ ప్రణవ్‌కు సన్మానం



గుంటూరు ఎడ్యుకేషన్: సివిల్ సర్వీసుల ద్వారా ప్రజలకు సేవలు అందించాలని ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు తెలిపారు. ఇటీవల విడుదలైన సివిల్స్ ఫలితాల్లో 60వ ర్యాంకు సాధించి, ఐఏఎస్‌కు అర్హత సాధించిన గుంటూరుకు చెందిన ప్రణవ్‌ను గురువారం శ్యామలానగర్‌లోని తన నివాసంలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో ఐఏఎస్ అధికారులు ముఖ్య పాత్ర పోషిస్తారని తెలిపారు. ప్రణవ్‌ను మన రాష్ట్రానికి కేటాయించాలని ఆకాంక్షించారు. సివిల్స్‌కు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు ప్రణవ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఐఆర్‌ఎస్‌కు ఎంపికైన అశ్విన్ మణిదీప్, సన్ వ్యవస్థాపకుడు యశ్వంత్, విజయకుమారి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మాతృమూర్తికి ఘన నివాళులు



నగరంపాలెం: పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌రావు మాతృమూర్తి శివపార్వతికి పలువురు నివాళులర్పించారు. శ్యామలనగర్ రెండో వీధిలోని ఆయన స్వగృహంలో గురువారం పెదకర్మ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంటు ఇన్‌చార్జి మోదుగుల వేణుగోపాలరెడ్డి, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, ఉప మేయర్ డైమండ్ బాబు, పశ్చిమ నియోజకవర్గ పరిశీలకులు షేక్ ఆసిఫ్‌ఖాన్, తూర్పు నియోజకవర్గం నాయకురాలు షేక్ నూరిఫాతిమాతో పాటు పలువురు రాజకీయ, వ్యాపారవేత్త ప్రముఖులు, బంధువులు పాల్గొని ఘన నివాళులర్పించారు.

భక్తిశ్రద్ధలతో లక్ష తులసి పూజ



పాత గుంటూరు: లాలాపేటలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం నిత్య హోమం, బలిహరణ, లక్ష తులసి పూజ నిర్వహించారు. రాత్రి హనుమంత వాహనంపై గ్రామోత్సవం వైభవంగా జరిగింది. కార్యక్రమాల్ని దేవస్థానం చైర్మన్ పిచ్చుల జయప్రకాష్‌రెడ్డి, ఈవో డి. శ్రీనివాసరావు, అర్చకులు ప్రసాద్, మురళి, చంద్రకుమార్, శ్రీనివాసాచార్యులు పర్యవేక్షించారు. ధర్మకర్తల మండలి సభ్యులు విశాలాక్షి, వెంకటజ్యోతి, నరేష్ కుమార్, రామకోటేశ్వరరావు, వెంకటరత్నం, శ్రీనివాసులు, అనిత, శివకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

4న గ్రూప్-1, గ్రూప్-2పై అవగాహన సదస్సు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీపీఎస్సీ త్వరలో నిర్వహించనున్న గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల కోసం ఈనెల 4న అమిగోస్ 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు సంస్థ చైర్మన్ పి.కృష్ణప్రదీప్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్ అశోక్‌నగర్‌లోని అకాడమీ కార్యాలయంలో జరిగే సదస్సులో గ్రూప్-1, గ్రూప్-2 సిలబస్, ప్రిపరేషన్ స్ట్రాటజీ, నోట్సు మేకింగ్, సమయపాలన తదితర అంశాలపై సీనియర్ అధ్యాపకులతో సమగ్ర అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నిర్వహించనున్న సదస్సులో పాల్గొనే అభ్యర్థులు 040-35052121, 9000230734 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

4న పెయింటింగ్ పోటీలు

పాత గుంటూరు: ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని 4న బ్రాడీపేట 2వ లైనులోని బాలానంద కేంద్రంలో ఉదయం 10 గంటలకు విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు 'శ్లోక హ్యూమానిటేరియన్ సంస్థ జిల్లా కో–ఆర్డినేటర్ విజయగౌరి తెలిపారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పాల్గొనే విద్యార్థులు పేర్లను 9010161799 నంబర్ ద్వారా నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు.

నిరంతర విద్యుత్ వెలుగులు

- రూ. 1.50 కోట్లతో 26 నూతన ట్రాన్స్‌ఫార్మర్ల నిర్మాణం
- ఓవర్‌లోడు సమస్య పరిష్కారానికి ట్రాన్స్‌ఫార్మర్లకు ఎంసీసీపీల ఏర్పాటు
- విద్యుత్ సరఫరాను వెంటనే పునరుద్ధరించే అవకాశం



ట్రాన్స్‌ఫార్మర్లకు నూతనంగా ఏర్పాటు చేసిన ఎంసీసీపీ

గుంటూరు ఈస్ట్: నగరంలో విద్యుత్ సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టారు. ముఖ్యంగా సరఫరాలో అంతరాయం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు. అవి దెబ్బతినకుండా మొదటిసారిగా ఎంసీసీపీలు అమరుస్తున్నారు. వేసవిలో పలు కాలనీల్లో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోంది. అదనపు లోడు పెరగడం, ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురికావడమే కారణంగా ఆ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. వినియోగదారులు అదనపు లోడు సమాచారాన్ని తొలుతే ఇచ్చిఉంటే ఈ సమస్య తలెత్తేది కాదంటున్నారు.

రెండు మిలియన్ యూనిట్ల వినియోగం

నగరంలో 2.60 లక్షల మంది వినియోగదారులు ఉన్నారు. వీరు రోజుకు రెండు మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగిస్తుంటారు. మొత్తం 6,600 ట్రాన్స్‌ఫార్మర్లు పని చేస్తున్నాయి. ఏసీలు, ఇతర విద్యుత్ పరికరాలు కొన్న సమయంలో సంబంధిత అధికారులకు వినియోగదారులు సమాచారం ఇస్తే ఆ ట్రాన్స్‌ఫార్మర్ల పరిధిలో ఎంత విద్యుత్ వినియోగం పెరిగింది అంచనా వేస్తారు. దీనికనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తారు. అయితే, ఈ వేసవిలో అనూహ్యంగా ఉష్ణోగ్రతలు పెరగడం, దానికి తోడు కొన్ని కాలనీల్లో వినియోగదారులు అదనపు లోడు సమాచారాన్ని అధికారులకు ఇవ్వకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురయ్యాయి. వేసవికి ముందే అధికారులు వచ్చే సమస్యల్ని ఎదుర్కొవడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. ఓవర్‌లోడు సమాచారం ముందస్తుగా లేకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్లు అప్పటికప్పుడు ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

26 ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

నగర ప్రజలకు వేసవిలో తలెత్తిన విద్యుత్ సరఫరా సమస్యను పరిష్కరించేందుకు అప్పటికప్పుడు అధికారులు పలు కాలనీల్లో 26 నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. ఇప్పటికే 13 చార్జ్ చేశారు. మరో వారం రోజుల్లో మిగిలిన వాటిని చేసేందుకు పనులు వేగవంతం చేశారు. ఈ నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుతో ఆప్రాంతాల్లో లో వోల్టేజీ, ఓవర్ లోడు సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతోంది.

మొదటిసారిగా ఎంసీసీపీల ఏర్పాటు

ఇప్పటి వరకు ట్రాన్స్‌ఫార్మర్లు ఓవర్‌లోడు ఏర్పడితే ఫీజులు దెబ్బతినేవి. వాటిని వేయడానికి సిబ్బందికి కొంత సమయం పట్టేది. ఒకేసారి ఎక్కువ ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతింటే విద్యుత్ సరఫరాలో భారీగా అంతరాయం ఏర్పడేది. దీన్ని పరిష్కరించడానికి అధికారులు ట్రాన్స్‌ఫార్మర్లకు ఎంసీసీబీలు మొదటిసారిగా ఏర్పాటు చేస్తున్నారు. మొదటి విడతగా రూ. కోటితో 2,200 ట్రాన్స్‌ఫార్మర్లకు ఏర్పాటు చేశారు. ఓవర్ లోడు కారణంగా ఎంసీసీపీ ట్రిప్ అయితే వెంటనే సిబ్బంది వాటిని క్రమబద్ధీకరిస్తారు. విద్యుత్ సరఫరాను వెంటనే పునరుద్ధరించే అవకాశం ఏర్పడింది.

ఇళ్లలో ఎంసీసీపీలు ఏర్పాటు చేసుకోవాలి



విద్యుత్ వినియోగదారులంతా నివాసాల్లో తప్పనిసరిగా ఎంసీసీపీలు ఏర్పాటు చేసుకోవాలి. ఈ కారణంగా విద్యుత్ పరికరాలు లోవోల్టేజీ సమస్య తలెత్తినప్పుడు మరమ్మతులకు గురికాకుండా రక్షించబడతాయి. విద్యుత్ అంతరాయం నివారింపబడుతోంది. మెరుగైన విద్యుత్ సరఫరా కోసం పెద్ద సంఖ్యలో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు నిరంతర ప్రక్రియగా కొనసాగుతోంది.

– శ్రీనివాసబాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్

ఉపాధ్యాయ ఉద్యమ నేత విజయరామరాజుకు నివాళి



విజయరామరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయ సంఘ నేతలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల హక్కుల సాధన, సంక్షేమం కోసం పాటుపడిన ఉద్యమ నిర్మాతల్ని స్ఫూర్తిగా తీసుకోవాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గేరా మోహనరావు తెలిపారు. కంకరగుంటలోని ఎస్టీయూ భవన్‌లో గురువారం ఉపాధ్యాయ ఉద్యమనేత, మాజీ ఎమ్మెల్సీ వీణా విజయరామరాజు శతజయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సంక్షేమం కోసం జీవితాన్ని ధారపోసిన ఉపాధ్యాయ ఉద్యమ పితామహునిగా వీణా విజయరామరాజు చిరస్మరణీయుడన్నారు. ఉపాధ్యాయ వాణి సంపాదకునిగా ఆయన సేవలు నిరుపమానమని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చందా నరసింహారావు, రాష్ట్ర కౌన్సిలర్లు డి.ఎ.జోసెఫ్, ఎం.పి.సుబ్బారావు, జిల్లా ఉపాధ్యక్షులు పేరేచర్ల శ్రీనివాసరావు, కె.వి.రమణ, బి. విజయబాబు పాల్గొన్నారు.

3న విజ్ఞాన మందిరంలో డాన్స్ సోలో పోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న కల్యాణ్ తదితరులు

పాత గుంటూరు: స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ నెల 3న వెస్టర్న్ డాన్స్ సోలో పోటీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర డాన్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు కల్యాణ్ తెలిపారు. బృందావన్ గార్డెన్స్‌లోని కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 3న ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని తెలిపారు. సాయంత్రం విజేతలకు బహుమతుల ప్రదానంతో పాటు నగరంలోని వివిధ డాన్స్ అకాడమీలకు చెందిన విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు కె.వి. రమేష్, సంయుక్త కార్యదర్శి సీహెచ్. ఉదయకుమార్, సభ్యులు రాజా, వెంకట్, కరీం, రాజాసింగ్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా 793 ట్రాక్టర్లు, 39 యంత్ర పరికరాలు పంపిణీ

నగరంపాలెం: వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా ఎనిమిది జిల్లాల్లోని లబ్ధిదారులకు 793 ట్రాక్టర్లు, 39 యంత్ర పరికరాల పంపిణీకి మార్కెటింగ్ శాఖ అధికారులు ఏర్పాట్లను సిద్ధం చేశారు. గుంటూరు చుట్టుగుంట కూడలిలో శుక్రవారం జరగనున్న కార్యక్రమంలో రైతులకు సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పరికరాలను పంపిణీ చేయనున్నట్లు మార్కెటింగ్ శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు కె.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా గత నెల 31 నుంచి ఈ నెల 2 వరకు గుంటూరు మిర్చి యార్డులో ఉచితంగా రైతులకు భోజన వసతి, మౌలిక సౌకర్యాల్ని కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. యార్డులో ట్రాక్టర్లు, యంత్ర పరికరాల పార్కింగ్, బ్రాండిగ్ కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. వివిధ మార్కెట్ కమిటీల కార్యదర్శులు, మిర్చియార్డు సిబ్బంది పనుల్లో నిమగ్నమయ్యారని ఆయన వివరించారు.

రైల్వే ఉద్యోగులు ఒత్తిడి లేని జీవితాన్ని గడపాలి



విజయవాడ ఇస్కాన్ టెంపుల్ ప్రెసిడెంట్ చక్రధారి ప్రభును సత్కరించిన డీఆర్‌ఎం రామకృష్ణ



డ్రాయింగులతో చిన్నారులు

- ఆరు రోజుల పాటు మిషన్ లైఫ్ స్ట్రెస్ మేనేజ్‌మెంట్ సదస్సు
- ప్రారంభించిన డీఆర్‌ఎం రామకృష్ణ

లక్ష్మీపురం: రైల్వే ఉద్యోగులంతా ఒత్తిడి లేని జీవితాన్ని గడపాలని డీఆర్‌ఎం ఎం. రామకృష్ణ తెలిపారు. పట్టాభిపురంలోని రైల్వే డివిజన్ ఆర్‌ఎం కార్యాలయంలో గురువారం డివిజన్ మిషన్ లైఫ్-లైఫ్ ఫర్ ఎన్విరాన్‌మెంట్‌లో భాగంగా ఆరు రోజుల పాటు నిర్వహించనున్న మిషన్ లైఫ్ స్ట్రెస్ మేనేజ్‌మెంట్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. మొదటి రోజు రైల్వే ఉద్యోగుల పిల్లలకు డ్రాయింగ్, పెయిటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం మాట్లాడుతూ పని ఒత్తిడిని పెంచుకోకుండా వాటిని సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ప్రతి రోజు వ్యాయామం, వాకింగ్, యోగా చేయాలని చెప్పారు. ప్రధానంగా ఉద్యోగ బాధ్యతల్లో అనేక రకాల సమస్యలు వస్తుంటాయని , వాటిని కార్యాలయానికి మాత్రమే పరిమితం చేయాలని సూచించారు. ఇంటి వరకు తీసుకెళితే కుటుంబాల్లో ఇబ్బందులు, ఒత్తిళ్లు తలెత్తే ప్రమాదముందని చెప్పారు. ఆరోగ్యకరమైన వాతావరణంలో , ఆహ్లాదకరమైన కార్యాలయ ప్రాంగణంలో విధుల్ని ఉల్లాసంగా, ఉత్సాహంగా నిర్వహించాల్సిందిగా తెలిపారు. విజయవాడ ఇస్కాన్ టెంపుల్ ప్రెసిడెంట్ ప్రముఖ వక్త చక్రధారి ప్రభు మాట్లాడుతూ రోజు వారీ జీవితంలో ఒత్తిడిని తగ్గించడానికి ప్రశాంతమైన జీవితాన్ని గడపడానికి అనుసరించాల్సిన పద్ధతుల్ని తెలియజేశారు. ఏడీఆర్ కె.సైమన్, శ్రీనివాస్, డివిజన్ అధికారులు శ్రీలత, జె.వి అనూష, సీతా శ్రీనివాస్, విభాగాధిపతులు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి గ్రామోత్సవం



గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

పాత గుంటూరు: కొత్తపేటలోని శ్రీ జగన్నాథస్వామి దేవస్థానంలో శ్రీ రుక్మిణీ సత్య భామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని విశేషంగా అలంకరించారు. ఉదయం గరుడ వాహనంపై గ్రామోత్సవం, మన్యు సూక్త హోమం నిర్వహించారు. రాత్రి దివ్య రథోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమాల్ని ఆలయ చైర్మన్ పిచ్చుల జయప్రకాష్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్, ఈవో డి. శ్రీనివాసరావు, అర్చకులు ఆయోధ్య అయ్యప్ప పర్యవేక్షించారు. ధర్మకర్తల మండలి సభ్యులు విశాలాక్షి, వెంకట జ్యోతి, నరేష్ కుమార్, రామకోటేశ్వరరావు, వెంకటరత్నం, శ్రీనివాసులు, అనిత, శివకుమారి పాల్గొన్నారు.

విద్య, వ్యవసాయానికి సీఎం జగన్ ప్రాధాన్యం



ఎక్స్‌రే, డెంటల్ చైర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పొన్నూరు(చేబ్రోలు): ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి వైద్యంతో పాటు విద్య, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పెనుమార్పులు తీసుకువచ్చినట్లు పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకటరోశయ్య తెలిపారు. పొన్నూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎక్స్‌రే ప్లాంటు, డెంటల్ చైర్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. పొన్నూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించడానికి రూ.40 లక్షలతో అధునాతన డెంటల్ చైర్, ఎక్స్‌రే ప్లాంటు, కంట్రోలర్ ఎనలైజర్ పరికరాల్ని ఏర్పాటు చేసి ఆధునీకరించినట్లు తెలిపారు. రాష్ట్రంలో త్వరలో మరో 12 మెడికల్ కళాశాలలు ప్రారంభంకానున్నట్లు చెప్పారు. రానున్న రోజుల్లో కోటి రూపాయిల వ్యయంతో ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంటు రేష్మ, వైద్య సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు, రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ దాసరి నారాయణరావు, అమిరినేని సాంబశివరావు, మాజీ కౌన్సిలర్లు ఎం. అనీలాకుమారి పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు



అధికారులతో సమావేశమైన కమిషనర్ కోటేశ్వరరావు

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం గుంటూరు పర్యటిస్తున్న సందర్భంగా నగరపాలక సంస్థ నుంచి ఎటువంటి లోపాలు లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, ప్రధానంగా పారిశుధ్యం పనులు సమగ్రంగా జరగాలని సీడీఎంఏ, నగర కమిషనర్ (ఎఫ్ఏసి) పి.కోటేశ్వరరావు నగరపాలక సంస్థ విభాగాధిపతులకు స్పష్టం చేశారు. శుక్రవారం కమిషనర్ చాంబర్‌లో ముఖ్యమంత్రి పర్యటనపై అదనపు కమిషనర్, విభాగాధిపతులతో సమీక్ష నిర్వహించారు. తొలుత ముఖ్యమంత్రి పర్యటన రూట్, సభావేదిక వివరాలు, సభకు హాజరయ్యే రైతులు, ప్రజల సంఖ్య అడిగి తెలుసుకుని, ముఖ్యమంత్రి పర్యటనను ప్రతి ఒక్కరూ చాలెంజ్‌గా తీసుకోవాలన్నారు. చుట్టగుంట ప్రాంతంలో ముఖ్యమంత్రి రైతులకు ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలను పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని, పెరేడ్ గ్రౌండ్ నుంచి చుట్టగుంట జంక్షన్ వరకు ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలని, డివైడర్ల పక్కన మట్టి కుప్పలు తొలగించాలని, పారిశుద్ధ్య పనులకు ప్రాంతాల వారీగా ప్రత్యేకంగా కార్మికులతో బృందాలను ఏర్పాటు చేసి, ఎంహెచ్‌ఓ నేరుగా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. పెరేడ్ గ్రౌండ్‌లో, సభావేదిక పరిసరాల్లో మొబైల్ టాయ్‌లెట్స్ ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటన ముగిసే వరకు డిప్యూటీ కమిషనర్లకు హెలిప్యాడ్, రూట్, సభావేదిక వద్ద బాధ్యతలు కేటాయించాలని అదనపు కమిషనర్‌ని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన మార్గంలో రోడ్ల మీద పాట్ హోల్స్ ఉంటే వాటికి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేసి, రోడ్ మీద డస్ట్ లేకుండా చర్యలు తీసుకోవాలని ఎస్ఈని ఆదేశించారు. సభకు హాజరయ్యే రైతులకు, ప్రజలకు ఎండ తీవ్రత దృష్ట్యా తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు అందించేందుకు ఆరు పాయింట్స్ ఏర్పాటు చేసి, అందుకు తగిన విధంగా సిబ్బందిని కేటాయించి, అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ పెద్ది రోజా, డిప్యూటీ కమిషనర్లు సి.హెచ్.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, ఎస్.ఈ. భాస్కర్, డిప్యూటీ సిటీ ప్లానర్ మూర్తి, ఎంహెచ్‌ఓ డాక్టర్ భాను ప్రకాష్, మేనేజర్ శివన్నారాయణ, ఈఈలు సుందరరామిరెడ్డి, కొండారెడ్డి, శాంతిరాజు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో రోగికి పింఛన్ పంపిణీ



గుంటూరు మెడికల్: కిడ్నీ జబ్బుతో బాధపడుతూ డయాలసిస్ చికిత్స చేయించుకుంటున్న షేక్ మీరావలికి రూ. 10వేలు పింఛన్‌ను గురువారం గుంటూరు జీజీహెచ్‌లో సచివాల య సిబ్బంది అందజేశారు. కార్యక్రమంలో 123వ సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ కె.నాగేశ్వరరావు, వలంటీర్లు దుర్గాభవాని, ఎస్.కె.సుభాని ఏఎన్‌ఎం రాజేశ్వరి పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

నగరంపాలెం: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని లాలాపేట పోలీసులు అరెస్టు చేశారు. ముందస్తు సమాచారంతో గురువారం నంగడిగుంట లాంఛెస్టర్ రోడ్డులో గంజాయి విక్రయిస్తున్న షేక్ బహదుల్లా, డి.జమలమ్మను అరెస్టు చేశారు. వారి నుంచి 250 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

టీడీపీ మేనిఫెస్టో అంతా బూటకం

పొన్నూరు (చేబ్రోలు): ప్రజల్ని మభ్యపెట్టే టీడీపీ దొంగ మేనిఫెస్టో వ్యతిరేకంగా గురువారం పొన్నూరు ఐలాండ్ సెంటర్‌లో వైఎస్సార్ సీపీ శ్రేణులు నిరసన వ్యక్తం చేశాయి. పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకటరోశయ్య సూచనల మేరకు పొన్నూరు పట్టణ, రూరల్ ప్రాంతాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు ఐలాండ్ సెంటర్‌లో అబద్ధాల చంద్రబాబు.. నిన్ను నమ్మం బాబు అంటూ ప్లకార్డులు, ఫ్లెక్సీలు పట్టుకుని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ 2014 టీడీపీ రూపొందించిన మేనిఫెస్టోలో హామీల్ని తుంగలో తొక్కి రాష్ట్ర ప్రజల్ని మోసం, నయవంచన చేశారని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దాసరి నారాయణరావు, బొద్దులూరి రంగారావు, అమిరినేని సాంబశివరావు, ఎం. అనీలా కుమారి, షేక్ షర్మిల, గేరా కుమారి, షేక్ మాము, పి.కృష్ణమోహన్, బాలాజీ, ఇందేటి వెంకటసుబ్బయ్య, రుద్రపాటి ఆదిశేషు, నూర్ బాషా పాల్గొన్నారు.

విజ్ఞాన్ యూనివర్సిటీ విద్యార్థికి పీహెచ్‌డీ

చేబ్రోలు: మండలంలోని వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ మెకానికల్ విభాగ విద్యార్థి కుంచెల బాలకృష్ణారెడ్డికి తమ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందజేసిందని వీసీ పి.నాగభూషణ్ గురువారం తెలిపారు. '' ఎక్స్‌పెరిమెంటల్ ఇన్వెస్టిగేషన్స్ ఆన్ వెల్డ్ బీడ్ జామెట్రీ అండ్ ప్రాసెస్ ఆప్టిమైజేషన్ ఇన్ రోబోట్–అసిస్టెడ్ వైర్ ఆర్క్ అడిటివ్ మ్యానుఫాక్చరింగ్'' అనే అంశంపై ఆయన పరిశోధన చేశారని పేర్కొన్నారు.

శివాలయంలో పుష్కర అష్టబంధన మహా కుంభాభిషేకం

ఆలయానికి చేరుకున్న విశాఖ శ్రీ శారదా పీఠాధీశ్వరులు శ్రీస్వరూపానందేంద్ర సరస్వతి స్వామి



శివాలయానికి చేరుకున్న విశాఖ శ్రీ శారదా పీఠాధీశ్వరులు శ్రీస్వరూపానందేంద్ర సరస్వతి

పెదకాకాని: స్థానిక మల్లేశ్వరస్వామి ఆలయంలో పుష్కర అష్టబంధన మహా కుంభాభిషేకం క్రతువు శైవాగమశాస్త్రోక్త సంప్రదాయ పద్ధతిలో ఘనంగా ప్రారంభమైంది. 12 సంవత్సరాలకు ఒకసారి చేసే ఈ మహా కుంభాభిషేకం విశాఖ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి, స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామివార్ల పర్యవేక్షణలో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 6 గంటలకు స్వాత్మానందేంద్ర సరస్వతీస్వామి చేతుల మీదుగా గోపూజతో పూజలు ప్రారంభమయ్యాయి. బ్రహ్మశ్రీ ఆగమిక నవులూరి సాయిబాబు దీక్షితులు ఆచార్యత్వంలో గురుపూజ, అంతరాలయ మూలగణపతికి విశేష స్నపన అర్చనలతో మొదలై యాగశాల ప్రవేశం , అఖండ దీపారాధన, అస్త్రరాజార్చనం, నీరాజనం, మంత్రపుష్పం, చతుర్వేద స్వస్తి, తీర్థ ప్రసాద వినియోగాలు నిర్వహించారు. స్థానిక శాసనసభ్యుడు కిలారి వెంకటరోశయ్య సరస్వతి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం అష్టబంధనపూజ, అష్టబంధన సమర్పణ, 108 మంది దంపతులతో అష్టోత్తర శతకలశ స్నపన మండపార్చన, సువాసినులతో సామూహిక సౌభాగ్య కుంకుమార్చన, శతరుద్రీయ జపాభిషేకకాలు, ద్వితీయ కాలహోమాలు, నీరాజన మంత్ర పుష్ప తీర్థ ప్రసాద వినియోగం ఉంటాయని ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. విశాఖ శారదాపీఠాధిపతులు గురువారం రాత్రి ఆలయానికి చేరుకున్నారు.

హజ్ యాత్రికుల బస, వసతులకు ప్రత్యేక ఏర్పాట్లు

డెప్యూటీ సీఎం అంజద్ బాషా



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డెప్యూటీ సీఎం అంజద్ బాషా

పెదకాకాని: మదర్సా నుంచి పవిత్ర హజ్ యాత్రకు వెళ్లే భక్తులు బస చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని డెప్యూటీ సీఎం, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి అంజద్ బాషా తెలిపారు. జూన్ 7 నుంచి రాష్ట్రానికి చెందిన భక్తులు హజ్ యాత్రకు బయలుదేరి వెళుతున్న నేపథ్యంలో బస చేస్తున్న పెదకాకాని మండలంలోని నంబూరు మదర్సా(సిరాజుల్ ఉలూమ్ అరబిక్ కళాశాల)ను గురువారం ఆయన పలువురు వక్ఫ్ బోర్డు ప్రతినిధులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా డెప్యూటీ సీఎం మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హజ్ వెళ్లే వారి కోసం హైదరాబాద్‌లో హజ్ హౌస్ ఉండేదన్నారు. విభజన తరువాత మొట్ట మొదటిసారిగా నంబూరు మదర్సాలో బస చేసి బయలు దేరుతారని తెలిపారు. మదర్సాలో నుంచి బస్సులో గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి విమానంలో హజ్ యాత్రకు వెళతారని వివరించారు. భక్తులకు ప్రయాణం భారం కాకుండా ఒక్కొక్కరి బ్యాంక్ ఎకౌంట్‌కు రూ. 80 వేల చొప్పున ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి జమ చేసినట్లు చెప్పారు. యాత్రికులకు భోజన ఏర్పాట్లు, విశ్రాంతి హాలు, బంధువులకు వసతులు, బహిరంగసభ నిర్వహణకు భారీ షెడ్డు నిర్మాణం, ప్రయాణ ఏర్పాట్లు, తాగునీరు వంటి అంశాలపై వక్ఫ్‌బోర్డు అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో హజ్ కమిటీ చైర్మన్ గౌసమ్ అజామ్, రాష్ట్ర మైనార్టీ సలహాదారుడు ఎస్.ఎం. జియావుద్దీన్, హజ్ కమిటీ డైరెక్టర్ బాసిత్, గుంటూరు నగర మేయర్ కావటి శివనాగమనోహర్‌నాయుడు, డెప్యూటీ మేయర్ షేక్ సజల, షేక్ నూరిఫాతిమా, జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ ఎస్.ఎం. సుభాని ఉన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపునకు మేజిక్ దోహదం

పెదకాకాని: మేజిక్‌పై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకశక్తి పెరుగుతుందని విశ్రాంత ఎంపీడీవో, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకుడు ఆదినారాయణ తెలిపారు. సమ్మర్ క్యాంప్ నిర్వహణలో భాగంగా గురువారం స్థానిక లూథర్‌గిరి కాలనీలోని గ్రంథాలయంలో విద్యార్థులకు మేజిక్ ఐటమ్స్, గణితంలో గమ్మత్తులు వంటి అంశాలపై వివరించారు.

గాలివాన బీభత్సం



పెదనందిపాడు: గాలివాన బీభత్సంతో మండలంలో పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. సరఫరా నిలిచిపోయింది. గురువారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఉరుములు, పిడుగులతో కూడిన వర్షం కురిసింది. వరగానిలో బొడ్డు చినబాబుకు చెందిన దూడ పిడుగుపాటుకు మృతి చెందింది. పెదనందిపాడు –బాపట్ల రహదారిలో నాగులపాడు వద్ద చెట్టు కూలి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ శాఖ సిబ్బంది కూలిపోయిన స్తంభాల్ని పునరుద్ధరించే పనిలో నిమగ్నమయ్యారు. విద్యుత్ లేకపోవడంతో మండలంలో గ్రామాలు అంధకారంలో ఉన్నాయి.